పంటల బీమా అమలు ఎప్పుడో?

- కిన్నెరసాని ముర్రేడు వాగుల పరిధిలో పంట నష్టపోతున్న రైతులు
- ప్రతి ఏటా అతివృష్టి లేదా అనావృష్టి
- బీమా అమలైతేనే లబ్ధి


ఉల్వనూరు వద్ద వరద నీటికి కొట్టుకుపోయిన పత్తి చేను (ఫైల్)

పాల్వంచరూరల్: అప్పు చేసి విత్తనాలు విత్తిన దగ్గర నుంచి పంట దిగుబడి చేతికి వచ్చే వరకు గ్యారంటీ లేని పరిస్థితులు నేడు దాపురించాయి. దీంతో ప్రతీ సంవత్సరం అతివృష్టి లేదంటే అనావృష్టితో రైతులు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. పంటబీమాను అమలు చేస్తే రైతులకు ప్రయోజకరంగా ఉంటుందని రైతులు ప్రభుత్వానికి కోరుతున్నారు. పాల్వంచ మండలంలో 36 గ్రామపంచాయతీల పరిధిలో ప్రతీ సంవత్సరం వానాకాలంలో పదివేల ఎకరాల్లో వరి, 15వేల ఎకరాల్లో పత్తి, 6వేల ఎకరాల్లో మొక్కజొన్న, వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగవుతుంది. రబీ సీజన్‌లో 8వేల ఎకరాల్లో వరి, 300 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో పెసర, కంది పంటలు సాగు చేస్తారు.

2018 నుంచి బీమా అమలు లేదు...

పంట బీమాకు 2018 నుంచి అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పంటబీమా అమల్లో ఉన్నప్పుడు పంట నష్టం జరిగితే అంతోఇంతో నష్టపరిహారం అందేది. బీమా పథకం అమలు చేస్తే ప్రీమియం చెల్లించిన రైతులకు పంట నష్టపరిహారం అందుకునే అవకాశం ఉంటుంది. బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు ఎనిమిదేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీమా అమలైతే రైతులకు మేలు...

పంటల బీమాను ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతీ ఏటా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారు. మండలంలోని కిన్నెరసాని, ముర్రేడు వాగుల పక్కన వందల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి ఇతర పంటలను వానాకాలంలోనే మాత్రమే సాగుచేస్తుంటారు. అయితే భారీవర్షాలకు కిన్నెరసాని గేట్లు ఎత్తినప్పుడు, ముర్రేడు వాగు పొంగినప్పుడు వరద ఉధృతికి పంటలు కొట్టుకపోయి, పోలాల్లో ఇసుక మేటలు వేసి అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది సుమారు రెండువందల ఎకరాలకు పైగా వరి పంట కిన్నెరసాని వాగు ఒడ్డున సాగు చేసిన పాల్వంచ మండలం యానంబైల్, రాజాపురం, సూరారం, పాండురంగాపురం, సోములగూడెం, రంగాపురం, నాగారం, సంగం, నారాయణరావుపేట, దంతలబోరు, సంగం, బంద్రుగొండ గ్రామాలతోపాటు, బూర్గంపాడు మండలం పినపాకపట్టినగర్, సోంపేట తదితర గ్రామాల్లో వందల ఎకరాలు నీటమునిగి, కొట్టుకపోయి రైతులకు నష్టం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టం సర్వే కూడా నిర్వహించారు కానీ, ఇంత వరకు నష్టపరిహారం రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే బీమా అమలులో ఉంటే రైతులకు పంటనష్టాన్ని వర్తింపజేస్తుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన బీమా పథకాన్ని రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.


ఇసుక మేట వేసిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి (ఫైల్)


నీళ్లు లేక ఎండిపోయిన వరిపొలం (ఫైల్)

ఏటా పంట నష్టమే..



నాకు కిన్నెరసాని వాగు ఒడ్డున ఒక ఎకరం పొలం ఉంది. ప్రతీ సంవత్సరం ఒక పంట వరిసాగు చేస్తాను. గతేడాది కురిసిన భారీవర్షాల కారణంగా కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడం వలన వరి పంటమొత్తం కొట్టుకపోయి ఇసుక మేట పెట్టింది. పెట్టుబడికి చేసిన అప్పులు కూడా తీరడం లేదు.

– జలగం చక్రయ్య, రైతు, నాగారం

బీమా అమలు చేయాలి...



కిన్నెరసాని వాగు ఒడ్డున కౌలుకు తీసుకుని సాగు చేసిన పంటపొలం భారీ వర్షాలకు నీటమునిగి ఇసుక మేట పెట్టింది. దీంతో పంట నష్టం వాటిల్లింది. ఎలాంటి పరిహారం రాలేదు. బీమా అమలులో ఉంటే పరిహారం లభించేది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కలిగే బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

– భూక్యా సాములు, రైతు, బిక్కుతండా

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేవు..



పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ఐదు నెలల క్రితం పంటల బీమాపై ఉన్నతాధికారలతో సమావేశం జరిగింది. ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. రాగానే బీమా పథకాన్ని రైతుల సాగు చేసిన పంటలకు అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– శంకర్, వ్యవసాయశాఖాధికారి, పాల్వంచ

విద్యార్థులకు యోగా శిక్షణ


యోగా చేస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ఆయుష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఆయుష్ యోగా ట్రైనర్ ప్రమీల విద్యార్థులచే యోగా చేయించారు. ఆమె మాట్లాడుతూ... పిల్లలు, పెద్దలక ప్రతీరోజు యోగా చేయడం వల్ల ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. ధ్యానం వలన మానసిక ఒత్తిడి తగ్గటంతోపాటు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. అదే విధంగా మానసిక దృఢత్వానికి, సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ఆందోళన తగ్గడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోజువారి యోగా చేయడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుందని, రక్తపోటు తగ్గటం, ఊపిరితిత్తులు సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక వెన్నునొప్పి, మధుమేహ వ్యాధి తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వండి..

సుజాతనగర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో వేలాది మంది పేదలకు ఇంటి స్థలాలు లేవని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

సాగు భూమి లెక్క తేలింది..

సుజాతనగర్: మండలంలో రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం కాని భూముల లెక్క తేలింది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గతంలో చేసిన సర్వేలో ప్లాట్లు, వెంచర్లు, పెట్రోల్ పంపు స్థలం, పాఠశాల, యార్డు, ఇళ్లు ఉన్న 165 ఎకరాలకు రైతుబంధు పథకం కింద డబ్బులు తీసుకుంటున్నట్లు గుర్తించారు. ఇట్టి భూములను పథకం నుంచి తొలగించేందుకు ప్రజాపాలన గ్రామసభల్లో ఆమోదించి ఆన్‌లైన్‌లో బ్లాక్ చేశారు. గత ప్రభుత్వం ఏడాదికి రెండు సీజన్లను కలిపి ఎకరాకు రూ.10 వేలు రైతుబంధు జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.12 వేలకు పెంచింది. అయితే సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండలంలో ఆయా రెవెన్యూ గ్రామాల్లో 165 ఎకరాల భూమిని సాగుకు యోగ్యం కానిదిగా గుర్తించారు.

ఆల్బెండజోల్ మాత్రలు మింగించండి..

జూలూరుపాడు: ఈనెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాతా బృందం శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. కళాజాతా బృందం ఆటపాటలతో ప్రజలకు వివరించారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం నివారించవచ్చని, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలను తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, ఆశ్రమ, వసతిగృహాల్లో మాత్రలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

పరిశ్రమలకు స్థలాలు కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గంలోని వెయ్యి మంది నిరుద్యోగ యువతకు చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు అవకాశం కల్పించాలని, ప్రభుత్వం తరపున పరిశ్రమలకు స్థలాలు కేటాయించాలని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సింగరేణి కేటీపీఎస్, నవభారత్, లాంటి పరిశ్రమలు ఉండగా, జిల్లాలో అవకాశం ఉన్న ప్రాంతాలలో నిరుద్యోగ యువతకు చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకునేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించడం లేదన్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం పరిశ్రమలు పెట్టుకునేందుకు మాత్రమే స్థలాలు కేటాయించారు. 20 ఏళ్లలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలు పెట్టుకునేందుకు ఎక్కడా స్థలాలు కేటాయించకపోవడంతో చిన్న తరహా పరిశ్రమలు ప్రభుత్వ సహాయంతో పెట్టాలనుకునే వారు సైతం నిరుత్సాహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు.

సీఏ పట్టా పొందిన 'గూడెం' విద్యార్థిని

కొత్తగూడెంఅర్బన్: ఆల్ ఇండియా స్థాయిలో సీఏలుగా పాస్ అయిన వారికి శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పట్టా ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సీఏ అకాడమీ ప్రొఫెసర్స్ చేతుల మీదుగా కొత్తగూడెంకు చెందిన వై.శ్రీనివాస్‌రెడ్డి కుతూరు దివ్యారెడ్డి పట్టా అందుకున్నారు. ఆమెను తల్లిదండ్రులు, అకాడమీ పెద్దలు, మాజీ కౌన్సిలర్లు అభినందించారు.

దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్త రేషన్‌కార్డులకు మీ సేవాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. కొత్త రేషన్‌కార్డు, మార్పులు, చేర్పులు ఆన్‌లైన్, మీసేవా సెంటర్లలో దరఖాస్తులు చేసుకునేందుకు నిర్ణీత గడువు ఏమీ లేదని, నిరంతరం కొనసాగుతుందని కొత్తగూడెం రెవెన్యూ అధికారులు వివరించారు.

చెత్త తొలగింపు

టేకులపల్లి: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రంలోని టేకులపల్లి, గోలియాతండా పంచాయతీలకు హద్దుగా ఉన్న ఇనుపమోరి వాగు మురుగు చెత్తకు నిలయంగా మారింది. వారపు సంత, రెండు పంచాయతీల పరిధిలో వ్యర్థాలను తెచ్చి వాగులో వేస్తున్నారు. అంతేకాకుండా పశువుల సంతలోని చెత్త కూడా వాగులోనే కలుస్తోంది. గ్రామాల్లో చెత్త కుండీలు లేకపోవడంతో వాగునే చెత్త కుండీగా మార్చారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరిస్తున్నప్పటికీ టేకులపల్లి, గోలియాతండా పంచాయతీలకు చెందిన ప్రజలు, వ్యాపారులు చెత్తంతా వాగులో వేస్తున్నారు. నీటి పారుదలకు అంతరాయం కలిగిస్తోందని సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని శుక్రవారం సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. కార్యదర్శి దీప్తి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వాగు వద్ద వేసిన చెత్తను తొలగించారు. కాగా వాగులో వేసిన చెత్తను మాత్రం తొలగించకపోవడం గమనార్హం.

మిత్రుల జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న మహిళలు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఇల్లెందురూరల్: మండలంలోని చెన్నంగులగడ్డ గ్రామంలో మిత్రుల జ్ఞాపకార్థం ఎనిమిది మండలాల స్థాయి కబడ్డీ పోటీలు కుమురం బీం యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీటీసీ పూనెం లింగమ్మ, చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నామనాయక్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమతో కలిసి చిరుప్రాయం నుంచి చదువుకున్న, ఆటలాడుకున్న మిత్రులు ఆరోగ్య కారణాలతో మృతి చెందిన నలుగురు స్నేహితులను గుర్తుచేసుకుంటూ వారి జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలకు వివిధ మండలాల నుంచి 46 జట్లు పాల్గొన్నాయి. అంతకు ముందు ప్రారంభ పోటీగా గ్రామ మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చాట్ల స్వామి, అలెం సారయ్య, కల్తి భిక్షం, అలెం అంజయ్య, పాయం లక్ష్మీనర్సు, ఊకే రాజేశ్వరి, నిర్వాహకులు ఈసం సతీష్, పాయం అశోక్, ఈసం సీవన్, అలెం పాపారావు తదతరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: మున్సిపాలిటీలో పని చేసే కార్మికులను పర్మనెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ, ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీయూసీఐ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం సమావేశం ఈ నెల 16న కొత్తగూడెంలో జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల కాలం గడిచినా మున్సిపల్ కార్మికుల వేతనాలు మాత్రం పెంచటం లేదన్నారు. ఈ సమావేశంలో శ్రీను, వెంకటేశ్వర్లు, కుమార్, భూలక్ష్మి, సంధ్య, భాగ్యమ్మ, శైలజ, శ్రీధర్, రవి, రఫీ, రాజేష్, రాజమ్మ, రమ, పుష్ప, స్వప్న, మల్లయ్య, మహేష్, శంకర్, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న ప్రసాద్ , ఇల్లెందురూరల్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో ఇఫ్టూ ఆధ్వర్యంలో ఊకే సురేష్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలి, సింగరేణి, మోటార్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఓటీ తదితర కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఇంకా అనేక వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రజలకు ఆరు గ్యారంటీలను వాగ్ధానం చేసి 7వ వాగ్ధానం ప్రజాస్వామ్యం పరిరక్షణ కాపాడుతానన్నారు కానీ, నేడు ప్రజాస్వామ్యం పరిహాసం అయిందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో లేనప్పుడు మరోమాట మాట్లాడటం పాలక పార్టీలకు అలవాటైందన్నారు. పాలకవర్గాల ద్వంద్వ వైఖరిని కార్మికవర్గం అర్థం చేసుకొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా నాయకులు బోడా మంచ, జి.ప్రసాద్, బి.మహేష్, భరత్, బన్నీ, బి.బాల, బి.బిచ్చు, బి.రవి, శ్రీరాములు, చిన్న గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కత్తుల ఎర్రయ్య, మూడు బిచ్చు, సురేష్, తార్యా, లింగ తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ ఆధ్వర్యంలో...

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న న్యూడెమోక్రసీ నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా నాయకుడు మోకాళ్ల రమేష్ కోరారు. ఈ మేరకు మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామంలో శుక్రవారం ఆయన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు అన్నివర్గాలకు ఆశచూపి నేడు నిధులు లేవన్న సాకుతో కాలయాపన చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు రావూరి ఉపేందర్, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ హట్కర్ దేవా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయిలయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలు


నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యాసా నరేష్ మాట్లాడుతూ... నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నేత అయిలయ్య అన్నారు. భూమి లేని నిరుపేదలకు సాగు భూములు పంచారని, ఎన్నో ప్రజాపోరాటాలు నిర్వహించిన మహానాయకుడు అని కొనియాడారు. అయిలయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి 2న సుజాతనగర్‌లో జరిగే కాసాని ఐలయ్య సంస్మరణ సభకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వెంకటి, కనకరత్నం, పద్మ, సుగుణ, ఇస్రా, బోడా అభిమిత్ర, బొల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి


మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రామకృష్ణ

జూలూరుపాడు: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం భేతాళపాడు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిధి రాచబండ్ల కోయగూడెం ప్రజలకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నివారణకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో 100 రోజుల టీబీ నిక్షయ్ షివిర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆయాసం, అలసట, తెమడలో రక్తం పడటం, మెడ చుట్టూ, సంక, గజ్జల్లో గడ్డ వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అని, ఇవి ఉన్నవారు ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ తరువాత ఉచితంగా నాణ్యమైన మందులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా నెలకు రూ.వెయ్యి ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, ఏఎన్‌ఎం రీనా, సుజాత, ఆశా కార్యకర్త కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలను ఆదుకోండి..


కలెక్టరేట్‌లో ఏఓ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ... ఉపాధి హామీ పనులు జిల్లాలో ప్రారంభమవుతున్నాయని, కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉపాధి పనులకు వచ్చేవారు ఎక్కువగా వ్యవసాయ కార్మికులేనని, వ్యవసాయ పనులు లేనందున పనులు దొరకక ఉపాధి హామీని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. పని ప్రదేశాలలో తాగునీరు, మెడికల్ కిట్లు, నీడ తదితర కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పారలు, గడ్డపారలు, తట్టలు తదితర పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కొంతమంది పనిరోజులు పూర్తి చేసుకున్న తరువాత మిగతా రోజుల్లో ఏ పనులకు వెళ్లాలో ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. కాబట్టి ప్రభుత్వం సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని, ఉపాధి పనులకు కేటాయించిన నిధులను ఉపాధి పనులకే ఖర్చు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో బుర్రా వెంకన్న, పోతుగంటి లక్ష్మణ్, ఎస్.వెంకటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

డిపెండెంట్ల సమస్యలు పరిష్కరించండి..


సింగరేణి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో మారుపేర్లు (అలియాస్) ఉన్న డిపెండెంట్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్, సీఐటీయూ, ఇఫ్టూల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సింగరేణిలో మారుపేర్లతో విధులు నిర్వహించి వారి పిల్లలకు డిపెండెంట్ల ఉద్యోగాలు కల్పించాలని ఈనెల రెండో తేదీ నుంచి బెల్లంపెల్లి ఏరియాలోని గొల్లేటి నుంచి కొత్తగూడెం వరకు చేపట్టిన ర్యాలీ శుక్రవారం కొత్తగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా వారు వివిధ యూనియన్ల సహకారంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ, వైస్ ప్రసిడెంట్ కూసన వీరభద్రయ్య మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో మారుపేర్ల సమస్యలతో సుమారు మూడు వేల మందిని విజిలెన్స్ విచారణతో ఇబ్బందిపెడుతూ డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భూపాలపెల్లిలో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సుమారు 14 నెలలు అవుతోందన్నారు. అప్పుడు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ జాతీయ కార్మిక సంఘాలతో కలిసి ఆర్‌ఎల్‌సీ వద్ద ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఎన్నికలు రావటంతో ఆ అంశం అటకెక్కిందని, తరువాత గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఎన్నికైన ఐఎన్‌టీయూసీలు నోరుమెదపని కారణంగా వీరి సమస్యల మరింత ముదిరిందన్నారు. డిపెండెంట్ల నియమకాల సమస్యను గనుల మీద కానీ, కార్పొరేట్ల మీద కానీ వెల్ఫేర్ విభాగం పరిష్కరించాల్సి ఉంది. వీరి నిర్లక్ష్యం కారణంగా, వీరి పని తగ్గించుకునేందుకు విజిలెన్స్ వారిని దూర్చటం వలన మూడు వేల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ విషయంలో విజిలెన్స్‌కు సంబంధం లేకుండా అందరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ ఆందోళనకు మద్దతు తెలిపిన ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ మాట్లాడుదూ... యాజమాన్యం, ప్రభుత్వం మొండివైఖరి వల్లనే సమస్య పరిష్కారం కావటం లేదని, సీఎండీ లెవల్ మీటింగ్‌లో మారుపేర్లు, విజిలెన్స్ బాధితులు సమస్య పరిష్కారం కోసం ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుందన్నారు. మరికొంత మంది ఉద్యోగాలు రాక, డబ్బులు అందక, పెన్షన్ లేక బాధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, సింగరేణి కార్పొరేట్ వెల్ఫేర్, విజిలెన్స్ విభాగాలు, సంస్థ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి షరతులు లేకుండా వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని లేదంటే గనుల్లో ఉత్పత్తి స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గడప రాజయ్య, వసికర్ల కిరణ్, రాసూరి శంకర్, బూర్గుల రవికుమార్, అశోక్, వెంకటేశ్వర్లు, తొగరు రాజశేఖర్, కాజా భక్షి, షమ్మీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఇఫ్టూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.